# వెంటాడిన అవమానం

"అమ్మా! ఇవాళ ఊరికి పోతానన్నావు కదనే!" అని అన్నాడు ప్రశాంత్‌రెడ్డి స్నానానికి వెళ్తూ వంకాయలు తరగుతున్న తల్లి లక్ష్మమ్మతో. అంట్లు కడుగుతున్న భార్య వీణ - ప్రశాంత్ మాటలు విని "ఉండుమని చెప్తుంటే వినడం లేదు. మీరైనా చెప్పండి" అని అంది ప్రశాంత్ నుద్దేశించి. అతను భార్య మాటలు విననట్లే నటించాడు. భార్య ఒత్తిడికి తల్లి ఎక్కడ ఉండిపోతుందో అనే ఆందోళన బయలుదేరింది ప్రశాంత్‌లో. "తల్లి వెళ్ళకపోతే కొంపలంటుకుంటాయి" అని అనుకున్నాడు. "ఎప్పుడెళ్తావే?" అని మరో రూపంలో అదే ప్రశ్న వేశాడు. ప్రశాంత్‌కు తల్లి మీద ప్రేమలేదని కాదు. ఆమె ఈ రోజు ఉండిపోతే నానా గొడవ అవుతుంది, ఇక్కడే కాదు ఊళ్ళోకూడా. రాహుల్ ఈ రోజు రాత్రి భోజనానికి వస్తానని చెప్పాడు. రాహుల్ తమ ఇంట్లోకి రావడం లక్ష్మమ్మ కంటబడిందంటే ఇంకేమైనా ఉందా? నానా యాగీ చేస్తుంది. రాహుల్‌ను ఇంట్లో కాలు పెట్టనివ్వదు. తనను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతుంది. అలా జరిగితే రాహుల్‌ను అవమానించడమే అవుతుంది. రాహుల్‌ను అవమానించి పంపితే ప్రశాంత్‌కు తన తల కొట్టేసినట్లు ఉంటుంది.

రాహుల్ ప్రశాంత్‌ను దేవుడిలా చూస్తాడు. మాదిగ ఎల్లయ్య రాహుల్‌గా రూపాంతరం చెందడంలో ప్రశాంత్ మంచితనం, కృషి ఉన్నాయి. అట్లని ప్రశాంత్ - రాహుల్ కన్నా వయస్సులో అంత పెద్దవాడేం కాదు. నాలుగైదేళ్ళు పెద్దవాడు కావచ్చు. ఎల్లయ్యతో బడిలో ఎవరూ స్నేహం చేసేవారు కాదు. గాంధీ లాంటి మహాపురుషుల జీవితాలను చిన్నప్పుడే ఒంట పట్టించుకున్న ప్రశాంత్ ఎల్లయ్యను అభిమానంతో చూసేవాడు. ఇంట్లో తల్లిదండ్రుల ఆధిపత్యం చెలాయించక పోవడం వల్ల కూడా ఎల్లయ్యతో స్నేహం చేసే అవకాశం చిక్కింది. తండ్రి టీచర్ కావడమే అందుకు కారణం. ఎల్లయ్య, ప్రశాంత్ స్కూల్ దగ్గరో, ఊరవతలవున్న గుట్ట దగ్గరో గంటలు గంటలు కూర్చొని మాట్లాడుకునేవారు. ఎల్లయ్యకు అర్థంకాని పాఠాలు ప్రశాంత్ చెప్పేవాడు. "ఊళ్లో ఉన్నన్ని రోజులే కాకుండా హైదరాబాద్‌లో స్థిరపడి అప్పుడప్పుడు ఊరికెళ్ళినపుడూ కూడా ప్రశాంత్ ఎల్లయ్య వాళ్ల ఇంటికి వెళ్లలేదు. ప్రశాంత్ ఎదురయితే "దండాలు దొర"! అని ఎల్లయ్య తల్లిదండ్రులు చేతులు జోడించేవారు. ప్రశాంత్ స్నేహం లభించాకే ఎల్లయ్యలో చురుకుదనం ప్రవేశించింది. పై చదువులకు కూడా వెళ్ళాడు. డిగ్రీ చేస్తున్నపుడే తన జాతిని ఉద్ధరించాలనే దీక్షతో ఉద్యమంలో తలమునకలవడం ప్రారంభించాడు. పతితులను, భ్రష్టులను, దగా పడిన తమ్ములను తాను పనిచేస్తున్న ప్రజాస్వామిక ఉద్యమంలోకి ఆహ్వానించడానికి, అందుకు వారిని ఉత్తేజపరచడానికి ఎల్లయ్య కలం కూడా పట్టాడు. ఈ పరిణామ దశలోనే ఎల్లయ్య రాహుల్‌గా అవతారమెత్తాడు. ప్రశాంత్ ఓ దినపత్రికలో సబ్

ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. ప్రెస్ నోట్ ఇవ్వడానికి వచ్చినప్పుడల్లా ప్రశాంత్‌ను కలిసి వెళ్లేవాడు రాహుల్. తాము నడుపుతున్న ఉద్యమం గురించి చెప్పేవాడు. తాను రాసిన, రాయబోతున్న కవిత్వం గురించి, ఆర్టికల్స్ గురించి చెప్పేవాడు.

రాహుల్ గురించి ఆలోచిస్తూనే ప్రశాంత్ ఆఫీస్‌కు రెడీ కాసాగాడు. తాను ఇంటికి రమ్మని ఎప్పుడడిగినా "పనుంది ఇపుడు వీలుకాద"ని చేప్పేవాడు. తాను అడగకుండానే "రేపు ఇంటికి భోజనానికి వస్తా" అని నిన్న ఆఫీసులో కలిసి చెప్పాడు. తన భార్య వీణది కూడా తమ ఊరే కాబట్టి ఆమెకు రాహుల్ తెలుసు. తమ సంభాషణల్లో రాహుల్ తరుచూ వస్తూనే ఉంటాడు. అందువల్ల రాహుల్ ఇంటికి వస్తే భార్య వీణ ఎంతో సంతోషిస్తుందని ప్రశాంత్ అనుకున్నాడు. ఆఫీసుకు బయలుదేరుతూ తల్లి లక్ష్మమ్మకు వంద రూపాయలు నోటిచ్చి "ఎండ ముదరక ముందే బయలుదేరు" అని చెప్పాడు ప్రశాంత్.

ముందు గదిలో వాలు కుర్చీలో కళ్లు మూసుకుని కూర్చున్నాడు ప్రశాంత్. ముఖంలో దిగులు తాండవిస్తోంది. అలా ఎంతసేపు కూర్చున్నాడో ప్రశాంత్‌కే తెలియదు. కళ్లు తెరిచి వాల్‌క్లాక్‌కేసి చూశాడు. రాత్రి ఏడున్నరవుతోంది. మధ్యగదిలోకి తొంగి చూశాడు. మంచంపై వీణ ముసుగు తన్ని అట్లాగే పడుకుని ఉంది. రాహుల్ రాడేమో? అనిపించింది. రాకపోతే బాగుండనుకున్నాడు ప్రశాంత్.

ఆఫీస్ నుంచి వస్తూనే "అమ్మ వెళ్లిపోయిందా?" అని అడిగాడు ప్రశాంత్ - తన రాకను గమనించి 'స్టౌ' మీద టీ గిన్నె పెడుతున్న భార్యనుద్దేశించి. "వెళ్ళింది. ఉండుమని ఎంతఅన్నా ఉండలేదు. నువ్వు ఉండమనలేదని బాధపడినట్లుంది" అంది వీణ. అదేమీ వినిపించుకోకుండా "రాహుల్ భోజనానికి వస్తున్నాడు" అని చెప్పాడు ప్రశాంత్. వీణ విసురుగా ప్రశాంత్ వైపు చూసి "ఆ ఎల్లయ్యేనా?" అని అడిగింది. అవునన్నాడు ప్రశాంత్. "మన కొంపనే దొరికిందా?" అని వ్యంగ్యంగా అంది. ఆ మాటల్లో హేళన కూడా ధ్వనించింది. ప్రశాంత్ మనసు చివుక్కుమంది. "అట్లంటా వేంది?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. "అడ్డమైన వాళ్ళందరికీ నేను వండిపెట్ట" అంది కోపంగా. "మనమంటే రాహుల్‌కు ఎంత అభిమానమో తెలిసి కూడా ఈ విధంగా మాట్లాడ్డం బాగా లేదు." అన్నాడు చిరాకు ప్రదర్శిస్తూ. టీ వడబోసి కప్పు ప్రశాంత్‌కు అందిస్తూ "నేను వండిపెట్ట" అని తేల్చేసి చెప్పిందామె. "భోజనానికి వస్తానని చెప్పిన మనిషిని వద్దని చెప్పడం ఏం బావుంటుంది?" అన్నాడు కాస్త తగ్గుతూ.

"అడుక్కునే బుద్ధులెటుపోతాయి. లేకి మనుషులు, లేకి బుద్ధులు" అంది ఈసడింపుగా. "నువ్వేం వండనక్కర్లేదు. నేనొండుకుంటాలే!" అన్నాడు ప్రశాంత్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు. "అది నే నొప్పుకోను. నువ్వొండి పెడితే నేను ఇంట్లో కూడా ఉండను" అంది మరింత కఠినంగా.

"నువ్వు మనిషివా, పశువ్వా? నీకసలు బుద్ధుందా?" అన్నాడు ఆగ్రహంగా.

"నీకు బుద్ధిలేదు కాబట్టే మాదిగోడికి మన కంచంలో తిండి పెడ్తానంటున్నావు" అంది ప్రశాంత్ చేతిలోని ఖాళీకప్పును విసురుగా లాక్కుంటూ.

ప్రశాంత్‌లో సహనం చచ్చిపోయింది. ఆగ్రహం ముంచుకొచ్చింది. ఏం చేయాలో అర్థం కాలేదు. భార్య జుట్టు పట్టి లాగాడు కోపంగా. ఆమె విసురుగా ప్రశాంత్‌ను తోసేసింది. దాంతో మరింత రెచ్చిపోయాడు ప్రశాంత్. ఎడా పెడా భార్యను కొట్టాడు. వీణ ఏడుస్తూ మంచం మీద ముసుగుతన్ని పడుకుంది. ప్రశాంత్ కొద్దిసేపు మంచం మీద భార్య పక్కన కూర్చొని ఆ తర్వాత ముందు గదిలోకి వచ్చి వాలు కుర్చీలో కూర్చున్నాడు. ఏం చేయాలో బోధపడలేదతనికి. కళ్లు మూసుకొని తలపట్టుకొని కుర్చీలో వెనక్కి వాలిపోయాడు. రాహుల్ రాకపోతే బాగుండని పదే పదే అనుకోసాగాడు. అడుగుల చప్పుడు వినిపించి కళ్లు తెరిచాడు. ఎదురుగా రాహుల్. పలకరింపుగా నవ్వాడు ప్రశాంత్. తెచ్చి పెట్టుకున్న నవ్వు. పేలవంగా ఉంది. అది ప్రశాంత్‌కు అనుభవంలోకి వస్తూనే ఉంది. రాహుల్ పసిగట్టకూడదని లేని ఉత్సాహం తెచ్చుకుంటూ కుర్చీ చూపించి 'కూర్చో' అని చెప్పాడు. రాహుల్ కూర్చుంటూ 'అక్కేది?' అని అడిగాడు. "పొద్దుటి నుంచి ఒక్కటే జ్వరం, పడుకుంది. అని అబద్ధమాడేశాడు ప్రశాంత్. అబద్ధమాడుతున్నపుడు ప్రశాంత్ మాట తడబడింది. ముఖానికి చెమటలు కూడా పట్టాయి. "డాక్టర్‌కు చూపించావా?" అని అడిగాడు రాహుల్. చూపించానన్నట్లు తలూపాడు ప్రశాంత్. ఎక్కువ మాట్లాడే ధైర్యం లేదు ప్రశాంత్‌కి. "హోటల్‌కెళ్దాం పద?" అన్నాడు ప్రశాంత్. "ఎందుకు?" అని ప్రశ్నించాడు రాహుల్. "అక్కకి జ్వరంకదా! వంట చేయలేదు. నాకు ఓపికలేదు" అని చెప్పాడు.

"నేను తినేసి వచ్చా. మా పాత ఫ్రెండొకడు కలిసి వాళ్లింటికి లాక్కెళ్లాడు. అన్నం తినమని మరీ బలవంతం పెట్టాడు. అందుకే లేటయింది" అని వివరణ ఇచ్చాడు రాహుల్. ఎందుకో ప్రశాంత్‌కు ఈ మాటలు నమ్మాలనిపించలేదు. విషయం అర్థమయ్యే రాహుల్ అబద్ధమాడుతున్నట్లనిపించింది. హృదయాన్ని సూదులతో పొడిచినట్టనిపించింది ప్రశాంత్‌కు. ఏమీ మాట్లాడలేదు.

"సరే, ఇకవెళ్తా" అంటూ లేచాడు రాహుల్. రాహుల్ చేతిని ప్రేమగా నొక్కుతూ "సారీ" అన్నాడు ప్రశాంత్. ఆ మాట అంటున్నపుడు ప్రశాంత్ గొంతు జీరబోయింది. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. "ఎందుకంత ఇదయిపోతావు. మరోసారి తప్పకుండా మా అక్క చేతి వంట తింటాకదా!" అని ఏమీ జరగనట్లే నవ్వుతూ చెప్పాడు రాహుల్. చెప్పులేసుకొని బయలు దేరిన రాహుల్ వెనకే బయటిదాకా వచ్చి అతను కనుమరుగయ్యే వరకు చూస్తూ ఉండిపోయాడు ప్రశాంత్. రాహుల్ రాసిన వ్యాసంలోని వాక్యాలు గుర్తువచ్చాయి ప్రశాంత్‌కు. "దళితులు మొదటి నుంచీ అవమానాలకు గురవుతూనే ఉన్నారు. ఆధిపత్య వర్గాల కన్నీళ్లు, సానుభూతి దళితులను ఉద్ధరించడానికి పనికిరావు. దళితులే ఆత్మగౌరవ పోరాటాలు చేస్తారు. తలకిందుల సమాజాన్ని సరిచేసి తమ హక్కులను తామే సాధించుకుంటారు". ఎంత అనుభవంతో అన్న మాటలివి అని అనుకున్నాడు ప్రశాంత్.

*(1999లో ప్రచురించిన 'శిలువ తొడిగిన మొగ్గ'*
*కథల సంపుటి నుంచి....)*